క్లుప్తంగా

నేడు మోడల్ ఆడిషన్స్

నయీంనగర్: ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి మోడల్స్ ఆడిషన్స్ కార్యక్రమాన్ని హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రోస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గౌస్‌పాషా తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు 75697 01494 నంబర్‌లో సంప్రదించి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

10న రుమటాలజీ వైద్య శిబిరం

హన్మకొండ: ఈనెల 10వ తేదీన హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఎం.మధుకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ వీ.సునీల్ వైద్య పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99665 54455, 78935 88057 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఫిబ్రవరిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

కరీమాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కరీమాబాద్‌లో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కరీమాబాద్‌లో కొమ్మిని రాజేందర్ అధ్యక్షతన అర్చకులు, కార్పొరేటర్లు, కాలనీవాసులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఫిబ్రవరి 11, 12, 13, 14వ తేదీల్లో బొడ్రాయి వేడుకలు నిర్వహించనున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

వీరన్నకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జియాలజీ విభాగం పరిశోధకుడు బోడ వీరన్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పెట్రోల్ జీ, జియో కెమిస్ట్రీ అండ్ పెట్రో జీన్సిస్ ఆఫ్ ది సివమాలై ఆల్కలైన్ ప్లూటాన్ కోయంబత్తూరు డిస్ట్రిక్స్ తమిళనాడు స్టేట్, సౌథర్న్ ఇండియన్ పెనిన్సులార్ ప్రావిన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బోడ వీరన్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి పర్యవేక్షణలో వీరన్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సమాచార సేకరణలో ఆర్టీఐదే ముఖ్య భూమిక

కాజీపేట అర్బన్: సమాచార సేకరణలో ఆర్టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్) ముఖ్య భూమిక పోషిస్తోందని ఆర్టీఐ క్యాంపెయినర్ రాకేష్ దుబ్బుడు తెలిపారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిట్ వరంగల్‌లోని బోస్ హాల్‌లో సమాచార హక్కు చట్టంపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులను ఎల్లప్పుడు గమనించే మూడో కన్ను సమాచార హక్కు చట్టం అని అన్నారు. 135 దేశాల్లో ఆర్టీఐ అమలులో ఉండగా భారతదేశం 62వ స్థానంలో ఉందని వివరించారు. కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సీఎస్ఆర్కే ప్రసాద్, సీహెచ్.సాయిప్రసాద్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ఎంజీఎం: రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోటిలో డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు వెళ్తున్న సందర్భంగా హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ సాంబశివరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు నూర సంపత్‌కుమార్, మురళి, పృథ్వీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గీసుకొండ : నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేసి, సమస్యలను పరిష్కరించాలని సంఘం (ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్ ఖన్నా కోరారు. ఈ మేరకు శనివారం వరంగల్ డీఎంహెచ్ఓ కె.వెంకటరమణకు యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నూర సంపత్‌కుమార్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ విద్యారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతోపాటు అర్హత ధ్రువీకరణ పత్రాల జీరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి 23వ తేదీలోపు హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ల్యాబ్ అసిస్టెంట్, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు గుర్తింపు పొందిన యూనివర్సిటీలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించినవారు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యారాణి సూచించారు.

'ఆశలకు' కేటీఆర్ క్షమాపణ చెప్పాలి



హన్మకొండ: రాస్తారోకో చేస్తున్న ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు



హసన్‌పర్తి: 'ఆశ'లను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



బిక్షాటన చేస్తున్న ఆశ కార్యకర్తలు

హసన్‌పర్తి: తమ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన ఆశ వర్కర్ల పట్ల మంత్రి కేటీఆర్ అనుచితంగా వ్యవహరించడంపై సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈక్రమంలో ఆశలకు మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి తహసీల్ కార్యాలయం వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి పుల్లా అశోక్ మాట్లాడుతూ ఆశ కార్మికులకు మద్దతు పలుకుతున్న సంఘాలు, నాయకులను పనికి మాలిన సంఘాలు, నేతలుగా కేటీఆర్ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు బొక్క సునీత, మాచర్ల రజిత, రాజేశ్వరి, పంజాల సరిత, దారాల సుమలత, దామెర నవమణి, కే.సరిత, ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్.. వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

హన్మకొండ: ఆశ కార్యకర్తలపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికావని, వాటిని విరమించుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఆశల పట్ల కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ హనుమకొండలోని ఏకశిల పార్కు నుంచి కాళోజీ కూడలి వరకు శనివారం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు శ్రీవాణి, యాకూబీ, రమ, శ్వేత, సంధ్య, ఎల్లమ్మ, మహేశ్వరి, కరుణ, సుభాషిని, స్వప్న, శారద, సుమలత, సమత, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల బిక్షాటన

ఖిలా వరంగల్: ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. వరంగల్ బట్టల బజార్ నుంచి బీట్ బజార్ వరకు ఆశ కార్యకర్తలు బిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీసం రూ.18వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రతినిధులు రాణి, వజ్ర, పద్మ, వనమాల, శ్రీదేవి, రాధిక, సునీత, పూల, రాజేశ్వరి, సాజియా, ప్రభాకర్, ఉపేందర్, సరిత, యాకూబ్‌పాషా, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భోజన కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసి పెట్టే మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో హనుమకొండ డీఈఓ కార్యాయం వద్ద కార్మికులు శనివారం దీక్ష చేశారు. ఈ దీక్షకు నాయిని రాజేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవటం శోచనీయమని విమర్శించారు. చాలీచాలని వేతనాలతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చక్రపాణి, పాల్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కట్ట మరమ్మతుకు కదిలిన ముదిరాజ్‌లు



మరమ్మతులు చేస్తున్న సంఘం సభ్యులు

మడికొండ: జూలైలో వచ్చిన వర్షానికి మడికొండలోని కొత్తకుంట చెరువుకట్టకు గండి పడింది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా వెళ్లిపోయింది. కట్టకు మరమ్మతులు చేయాలని విన్నవించి మూడు నెలలు అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ముదిరాజ్ కుల సంఘం సభ్యులు శనివారం మరమ్మతులు చేశారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దువ్వ నవీన్, గౌరవ అధ్యక్షుడు దువ్వ కొంరయ్య, సభ్యులు కొలిపాక కుమారస్వామి, నర్ర దుర్గయ్య, కుక్కల దేవరాజ్, దువ్వ కట్టయ్య, శ్రీకాంత్, శేఖర్, కుమారస్వామి, విజయ్, సమ్మయ్య, అశోక్, రవి, రాజేందర్, పవన్, సందీప్, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న అయిలయ్య

కేయూ క్యాంపస్: సామాజిక శాస్త్రాల విద్యార్థులు సమాజంపై మరింత అవగాహన పెంచుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. బీఏ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం (వెల్‌కం) సమావేశాన్ని రెండో, ఫైనల్ ఇయర్ విద్యార్థులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ సమాజాన్ని నిరంతరం పరిశీలిస్తూ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విప్లవాత్మకమైన మార్పులను గమనించాలని చెప్పారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, అధ్యాపకులు భిక్షపతి, లక్ష్మీనారాయణ, చారి, సదాశివ్, దాస్, తిరణహరి శేషు, హరికుమార్, ఉప్పయ్య, వీరస్వామి, చిత్రరాజు, పుల్లా రమేష్, సదానందం, సంజీవ, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ఏర్పాటు



రామన్నపేట: వరంగల్ ఏవీవీ ఉన్నత పాఠశాలలోని 1979 -80వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని ఏర్పాటు చేశారు. ఏవీవీ అలుమ్ని కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.లక్షా 50 వేల విలువ గల డిజిటల్ ప్రొజెక్టర్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏవీవీ అలుమ్ని అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఏవీవీ పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు వాసుదేవులు, ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగలకు న్యాయం చేయాలి



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు సామాజిక న్యాయం జరగాలని ఎమ్మార్పీఎస్ – టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా ఆకాంక్షించారు. నవంబర్ 23న జరగనున్న మాదిగల యుద్ధభేరి బహిరంగ సభ కరపత్రాలను సంఘం నాయకులు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మాదిగల జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేసేలా అన్ని రాజకీయ పక్షాలు అధికార బీజేపీపై ఒత్తిడి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్ నాయకులు మేడ స్వామి, దేవరకొండ సదానందం, బొచ్చు మొగిలి, తాళ్లపల్లి యోబు, పోగుల రాకేష్, జన్ను సంజీవ్, కట్టెపోగుల ప్రశాంత్, తీగల సుధాన్, గోల్కొండ శ్రీనివాస్, గిన్నారపు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కోటను సందర్శించిన వలంటీర్లు



శిల్పాల ప్రాంగణంలో హెరిటేజ్ వలంటీర్లు

ఖిలా వరంగల్: అక్టోబర్ 2నుంచి 13వ తేదీ వరకు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండు రంగారావు, శ్రీధర్, రిటైర్డ్ ఐఏఎస్ పాపారావు సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ -2023 ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఓరుగల్లు కోటను హెరిటేజ్ వాలంటీర్లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రాతి, మట్టికోట అందాలతోపాటు ఖుష్‌మహల్, శిల్పాల ప్రాంగణం, శృంగారపు బావిని వారు తిలకించారు. కాకతీయుల నిర్మించిన కట్టడాలు, శిల్పకళా సంపద విశిష్టతను అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ వివరించారు. కార్యక్రమంలో సత్తు శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీనివాస్, కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు పట్టి.. కల్లు తాగిన ఎమ్మెల్యే



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురంలో ప్రజల సమక్షంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్.. ఆకు పట్టి కల్లుతాగారు. ఈమేరకు ఎమ్మెల్యే కల్లు తాగిన ఫొటో వైరల్‌గా మారింది. సిద్దాపురంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, స్థానిక గౌడ కులస్తుల కోరిక మేరకు ఓ దమ్ము కల్లుపట్టారు.

హక్కుల సాధనకు నిరంతర పోరు



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: పాలక వర్గాలపై విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నిరంతరం పోరు చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రీ అన్నారు. పాలకులు అవలంభిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏఐవైఎఫ్‌కు ఉందని గుర్తుచేశారు. వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర 2వ మహాసభల పోస్టర్లను శనివారం విడుదల చేశారు. అక్టోబర్ 29, 30తేదీల్లో హైదరాబాద్ జిల్లాలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా నాయకులు మస్క సుధీర్, మతిన్, జగదీష్, రక్షిత్, రాహుల్, మహేష్, గణేష్, సమ్మర్, నదీమ్ పాల్గొన్నారు.

కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యం



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖిలా వరంగల్: రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ఆరోపించారు. 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట, శాకరాశికుంట కట్ట, శాంతినగర్ ప్రాంతాల్లో నాయకుడు చిలివేరు రాజేందర్ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాకరాశికుంట కట్ట కరీమాబాద్ రోడ్డుపై గుంతలమైన కల్వర్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి గుంతల్లో పూలు చల్లి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడూతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి సుమారు దశాబ్ద కాలం అవుతున్నా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల భిక్షపతి, వనం కార్తీక్, రామోజు ప్రదీప్, దుస్సా శివకుమార్, వేముల రాజు, బైరి శ్యాంసుందర్, బైరి నాగరాజు, ఇనుముల అజయ్, మైదం వీరస్వామి, ఆడెపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆందోళన కార్యక్రమాల నిలిపివేత

కాజీపేట: సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ హామీ మేరకు ఆందోళన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్లగిరి రామలింగం ప్రకటించారు. కాజీపేట 61వ డివిజన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ విగ్రహాన్ని అపహరించి రజకుల ఆత్మగౌరవానికి భంగ కలిగించిన శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్‌తో వంటా – వార్పు కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు తెలిపారు. ఈక్రమంలో స్థానిక ఏసీపీ డేవిడ్‌రాజ్ జోక్యం చేసుకుని కొద్దిరోజుల్లోనే విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీపీతో హామీ ఇచ్చారని తెలపడంతో ఆందోళన కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

కరీమాబాద్: మీడియా సంస్థలు, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఢిల్లీలో జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ గ్రేటర్ పరిధిలోని తిమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో అనూష, స్వాతి, చిరంజీవి, రాజేష్, రజియా, నరసింహరాజు, బద్రి, షమీనా, ప్రతిమ, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌జీఓస్ అధ్యక్షుడికి అభినందన

కరీమాబాద్: టీఎస్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్.. కాకతీయ మెడికల్ కళాశాలలో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఈక్రమంలో ఆయనను పలువురు ఉద్యోగులు శనివారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓస్ ఈసీ మెంబర్లు ఎండీ.మహబూబ్, సమాచార శాఖకు చెందిన మనోజ్‌కుమార్, కేఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌ను కలిసిన గడ్డం తిరుపతి

హన్మకొండ: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను టీఎస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ చైర్మన్ గడ్డం తిరుపతి కలిశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన వెంకటయ్యను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తనిఖీల్లో రూ.4,66,500 పట్టివేత

మడికొండ: మడికొండ చౌరస్తాలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారులో రూ.4,66,500 నగదు దొరికింది. పోలీసులు విచారించి సొంతానికి ఉపయోగించుకోవడానికి తీసుకెళ్తున్నట్లు నిర్ధారించి తిరిగి సదరు వ్యక్తికి అప్పగించారు.

సీబీసీలో ఉచిత వైద్య శిబిరం

కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్‌కాలనీ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి (సీబీసీ)లో వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్‌దయాళ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ శనివారం ప్రారంభించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు టీ.మధులత ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

యాదవవాడలో బొడ్డెమ్మ వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోట యాదవవాడలో ఉప్పల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలను శనివారం నిర్వహించారు. రజిత, రక్షిత, తన్వీ, బక్కులు, వర్ష, రమ, మమత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే

ఖిలా వరంగల్: 37వ డివిజన్ తూర్పుకోటలో ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ పాల్గొని ప్రజా సమస్యలను సేకరించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ తూర్పు ఇన్‌చార్జ్ ఐతం నగేష్, ఎంసీపీఐ నేత రాయినేని ఐలయ్య, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో తాటి మొక్కలు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామశివారులోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం ఆవరణలో సంఘం నాయకులు తాటి మొక్కలు నాటారు. హన్సిక గౌడ్ పుట్టిన రోజును పురస్కరించుకుని సంఘం అధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పెంచే బాధ్యతను స్వీకరించారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు కళాశాలలో చేపట్టిన కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను అరెస్టు చేయటం అప్రజాస్వామికమన్నారు.

కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ దీక్షలు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించిన వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ క్యాంపస్‌లోని దూరవిద్య కేంద్రం ఆవరణలో చేపట్టిన దీక్షలు శనివారం 32వ రోజుకు చేరుకున్నాయి.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం పంపిణీ చేశారు.

గుడిసెవాసుల పట్టాల అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే నరేందర్ శనివారం పట్టాలు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

హసన్‌పర్తి: భార్య మందలించిందని మనోవేదనకు గురై క్రిమిసంహారక మందు తాగిన గుండ్లసింగారానికి చెందిన నాంపెల్లి మొగిలి (52) ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

కేటీఆర్ ఇక్కడి నుంచే పోటీ చేయాలి



మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

హన్మకొండ: వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్.. సిరిసిల్లను వదిలేసి వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి సవాల్ విసిరారు. హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో వరదలొచ్చిన సమయంలో రాకుండా ఎన్నికల కోసం ఇప్పుడు వచ్చారని ఎద్దేవాచేశారు. నగరంలో మంత్రి కేటీఆర్ శుక్రవారం చేసింది సుడిగాలి పర్యటన కాదని, సున్నా పర్యటని అని విమర్శించారు. కార్పొరేటర్ రవి నాయక్, బీజేపీ నాయకులు నిరంజన్, తరుణ్ రెడ్డి, శ్రావణ్‌యాదవ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



చిన్నారులకు నగదు అందజేస్తున్న దాతలు

వరంగల్: తల్లిదండ్రులు లేని నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన అనాథ పిల్లలకు వరంగల్ కూరగాయల మార్కెట్ సొసైటీ సభ్యులు, అభయ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శనివారం రూ.26వేల ఆర్థిక సాయం చేశారు. బండి మానస సెప్టెంబర్ 24వ తేదీన పాముకాటుతో చనిపోయింది. ఆమె భర్త 8ఏళ్ల క్రితం చనిపోయాడు. దాంతో ఆ పిల్లలు అనాథలుగా మారారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అనాథలను ఆదుకోవాలని కోరారు. మార్కెట్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బిట్ల కృష్ణ, మహ్మద్ అలీ, అభయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బిట్ల సరిత, రాధిక, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

దూసుకెళ్లిన కారు



హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా చింతగట్టు క్యాంప్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో కారు దూసుకెళ్లడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శనివారం జరిగింది. నగరానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు తన శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ నిమిత్తం కారులో ఆర్టీఏ కార్యాలయానికి వచ్చాడు. అర్హత పరీక్షలు ముగిసిన అనంతరం కారును స్టార్ట్ చేసుకుని వెళ్లే క్రమంలో కారు దూసుకెళ్లి కందకంలో దిగబడింది.

పట్టాపొందిన అంగన్‌వాడీల హర్షం

హన్మకొండ కల్చరల్: మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా వరంగల్ దూపకుంటలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను శుక్రవారం ప్రారంభించాల్సి ఉండగా రద్దయింది. 2008లో కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, జర్నలిస్టులు ఇళ్లు నిర్మించుకోవడానికి దూపకుంటలో ఉమ్మడి ఏపీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేసిన భూముల్లో 58 మంది అంగన్‌వాడీలకు పట్టాలు అందజేశారు. 'డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించండి' అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఆ వార్తకు సంబంధించిన క్లిప్పింగ్ అంగన్‌వాడీలు తమ స్టేటస్, వాట్సాప్‌లలో షేర్ చేయడంతో వైరల్‌గా మారి కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో ఇళ్ల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిందని అంగన్‌వాడీలు తెలిపారు. పట్టాలు పొందిన వారి వివరాలు సేకరించి అందరికి ఇళ్లు ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులను మంత్రి ఆదేశించినట్లు వివరించారు. దాంతో తమకు కూడా పట్టాలు వస్తాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.